# నమస్తే ఉదయం

తెలుగు దినపత్రిక

రంగారెడ్డి | సంపుటి : 01 | సంచిక: 353 | పేజీలు: 4 | వెల: 4/- | సోమవారం ● 08, జులై 2024 | ఎడిటర్: ఎం.వనితా రెడ్డి




## నేడు విజయవాడ వెళ్లనున్న సీఎం రేవంత్

హైదరాబాద్, జూలై 7(నమస్తే ఉదయం): తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం విజయవాడకు వెళ్లనున్నారు. ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల ఆధ్వర్యంలో జరగనున్న వైఎస్సార్ జయంతి సభలో రేవంత్ రెడ్డి పాల్గొంటారు. ఈ కార్యక్రమంలో సీఎంతో పాటు డిప్యూటీ సీఎం, పలువురు మంత్రులు వెళ్లనున్నారు. ఉమ్మడి రాష్ట్ర దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 75వ జయంతి కార్యక్రమానికి రేవంత్ హాజరవుతున్నారు. వైఎస్ షర్మిల ఆధ్వర్యంలో మంగళగిరిలోని సీకే కన్వెన్షన్ హాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.


# రంగనాయక స్వామి కోనేరును అనుమతులు లేకుండా ఎలా పూడ్చేస్తారు



### ఈ వ్యవహారంతో సంబంధమున్న ఎంతటి వారినైనా వదలొద్దు

### పార్లమెంటు సభ్యురాలు డికె అరుణ ఫైర్

మహబూబ్ నగర్,జూలై 7 (నమస్తే ఉదయం): జడ్చర్ల పెద్ద గుట్టపై ఉన్న రంగనాయక స్వామి దేవాలయం కోనేరు ను ఎలాంటి అనుమతులు లేకుండా ఎలా పూడ్చి వేస్తారని మహబూబ్ నగర్ పార్లమెంటు సభ్యురాలు డికె అరుణ ఫైర్ అయ్యారు.ఈ సంఘటనపై ఆదివారం ఆమె 'దిశ'తో ఫోన్‌లో మాట్లా డుతూ జడ్చర్ల సీఐ ఆదిరెడ్డికి ఫోన్ చేసి ఆరా తీశానని, నిబంధనలకు విరుద్ధంగా పూడ్చి వేతపై సామాగ్ర విచారణ జరిపించి,ఈ వ్యవహారంతో సంబంధమున్న ఎంతటి వారినైనా వదలొద్దని ఆదేశించినట్లు ఆమె తెలిపారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా దోషులను శిక్షించాలని, హిందువుల మనోభావాలను కించ పరిస్తే చూస్తూ ఊరుకునేది లేదని ఆయన హెచ్చరించారు.



# రంగంలోకి దిగిన కేటీఆర్

### జిల్లాలో బీఆర్ఎస్ పార్టీ పటిష్టత కోసం అడుగులు

### స్వయంగా నాయకులకు ఫోన్ చేస్తున్న కేటీఆర్

గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై 7(నమస్తే ఉదయం): రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పార్టీ వదిలి కాంగ్రెస్ పార్టీ లోకి మారుతుండడంతో బీఆర్ఎస్ పార్టీ దిద్దుబాటు చర్యలు చేపట్టింది. జోగులంబ గద్వాల జిల్లా లో ఇద్దరు ఎమ్మెల్యే లు కృష్ణ మోహన్ రెడ్డి ,అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు, ఎమ్మెల్సీ చల్ల వెంకట్రామి రెడ్డి పార్టీ వదిలి కాంగ్రెస్ పార్టీ లోకి మారుతుండడంతో పార్టీ కాళీ కాకుండా స్వయంగా కేటిఆర్ ఫోన్ చేసి ప్రముఖ నాయకులకు భరోసా ఇస్తున్నారు. బీఆర్ఎస్ పార్టీలోనే కొనసాగాలని సముచిత గౌరవం ఉంటుందని, భవిష్యత్తులో పార్టీ అన్ని రకాలుగా అండ ఉంటుందని నాయకులు తెలిపినట్టు సమాచారం. నాయకులు పార్టీ మారినంత మాత్రాన పార్టీ పునాది గట్టిగా ఉందని తొందరలోనే కాంగ్రెస్ పార్టీ భవిష్యత్తు వుండదని భవిషత్తులో బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వస్తుందని నాయకులతో కేటిఆర్ మాట్లాడారని సమాచారం. గద్వాల పట్టణంలోని ప్రముఖ బిసి నాయకుడు కాంగ్రెస్ పార్టీ లోవున్న నాయకుడు తో కేటిఆర్ ఫోన్ చేసి మాట్లాడినట్టు సమాచారం. అదే విధంగా గట్టు బాసు హనుమంతు నాయుడు తో పార్టీ లోనే కొనసాగాలని తెలిపారని పార్టీ లోనే కొనసాగుతామని హనుమంతు మీడియా ముందు తెలిపారు. త్వరలోనే గద్వాల కు కేటిఆర్ పర్యటించే అవకాశం ఉన్నదని ,మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి గద్వాల నాయకులతో మంతనాలు చేస్తున్నట్టు సమాచారం . ఏదైమైన బీఆర్ఎస్ పార్టీ జిల్లాలో ప్రతిష్టత తీసుకున్నదని తెలుస్తుంది. గద్వాల నియోజకవర్గం లోని బిసిలు నగరంలోని ప్రముఖ బిసి నాయకుడు మరియు బాసు హనుమంత నాయుడు, ఆంజనేయులు గౌడ్, గొంగళ్ల రంజిత్, మాజీ జెడ్పిటిసి పద్మ వెంకటేశ్వర రెడ్డిలు బీఆర్ఎస్ వైపు భవిష్యత్తులో కలిసి వుండే వుండే అవకాశం ఉంది.

# అమ్మా బైలెల్లినాదో..!

- గోల్కొండ బోనాలు షురూ.. పూనకాలు లోడింగ్
- కుల వృత్తులు బ్రతకాలంటే అందరూ సహకరించాలి : మంత్రి పొన్నం
- మట్టి పాత్రలను ఎక్కువగా వాడాలి : మంత్రి కొండా సురేఖ



హైదరాబాద్, జూలై 7(నమస్తే ఉదయం): బోనాల పండుగ హైదరాబాద్ జంట నగరాల సంస్కృతీ, సంప్రదాయాలకు పుట్టినిల్లు అని, గతంలో బోనం మట్టి కుండలోనే చేసేవారని, ఇప్పుడు కూడా బోనం ప్రకృతి పర్యావరణమే కాకుండా అమ్మవారికి ఇష్టమైన మట్టి కుండలోనే చేయాలని హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. భాగ్యనగరంలో ఆషాఢ మాసం బోనాల పండుగ వైభవంగా ప్రారంభం కాగా, శివసత్తుల పూనకాలతో, పోతరాజుల వీరంగాలతో, డప్పు దరువులతో భాగ్యనగరం శివమెత్తింది.

ఈ నేపథ్యంలోనే ఆదివారం పలు ఆలయాలకు వెళ్లిన మంత్రులు కొండా సురేఖ, హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్‌లు అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేసి ఘటాలు సమర్పించుకున్నారు. అనంతర మంత్రి పొన్నం మాట్లాడుతూ బోనం మట్టి కుండలో సమర్పిస్తేనే మరింత పుణ్యం ఉంటుందని, ఇతర పాత్రల్లో చేసిన దానికంటే మట్టి కుండలో చేస్తేనే అమ్మవారి ఆశీర్వచనం అందుతుందన్నారు. హైదరాబాద్ బోనాల్లో పాల్గొనే భక్తులందరూ మట్టి కుండలోనే బోనం చేయాలని ఆయన భక్తులకు విజ్ఞప్తి చేశారు. దేవాదాయ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ ఈ బోనాలకు అవగాహన కల్పించే కార్యక్రమాలు జరగాలన్నారు. కుమ్మర్లు గ్రామీణ ప్రాంతాల్లో ఆహారాన్ని వండుకునే వస్తువుల దగ్గరి నుంచి అన్ని రకాల మట్టితో చేసిన పాత్రలను తయారు చేస్తుంటారని, కాలం మారుతోంది మళ్లీ కుల వృత్తి బతకాలంటే ఆయా కుల వృత్తులు తయారు చేసే వస్తువులను అందరూ వాడాలని మంత్రి కొండా సురేఖ పిలుపునిచ్చారు. కుల వృత్తి బతకాలంటే అమ్మవారి ఆశీర్వాదం పొందాలని ఆమె పేర్కొన్నారు.

### ప్రభుత్వం తరుపున పట్టువస్త్రాలు..

గోల్కొండలో తొలిబోనం సమర్పించడంతో నగరంలో బోనాల జాతర షురూ అయ్యింది. సంప్రదా య బద్ధంగా గోల్కొండ కోటలోని శ్రీ జగదాంబిక అమ్మవారికి రాష్ట్ర కుమ్మర్ల సంఘం ఆధ్వర్యంలో తొలి బోనం సమర్పించారు. తెల్లవారుజూము నుం చే భక్తులు కుటుంబ సభ్యులతో కలిసి పెద్ద సం ఖ్యలో గోల్కొండ కోటకు చేరుకున్నారు. భక్తితో మ ట్టి కుండలో పరమాన్నం వండి, బోనాలు సిద్ధం చేసి ఆలయానికి తీసుకొొచ్చారు. మధ్యాహ్నం జగదాంబిక, మహంకాళి అమ్మవార్ల ఉత్సవమూర్తుల ను ఊరేగింపుగా కోటపైకి తీసుకెళ్లారు.

ఇక తెలంగాణ ప్రభుత్వం తరుపున లంగర్‌హౌజ్‌లో తెలంగా ణ బోనాల దశాబ్ది ఉత్సవాలను స్పీకర్ గడ్డం ప్రసా ద్, మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖలు ప్రారంభించి అమ్మవార్లకు పట్టువస్త్రాలను సమర్పించారు. ఎమ్మెల్యే దానం నాగేందర్, మేయర్ వి జయలక్ష్మి తదితరులు సైతం హాజరయ్యారు. అక్క డి నుంచి పట్టు వస్త్రాల ఊరేగింపు, తొట్టెల ఊరేగింపు గొల్కొండ కోట వరకు కొనసాగాయి. అనంతరం బంజారా దర్వాజ వైపు నుంచి నజర్ బోనం తో అమ్మవారి ఊరేగింపుగా గోల్కొండ కోటకు చేరుకుంది. ఆలయంలో అమ్మవారి ఘటాలను ఉ ంచిన తరువాత భక్తులు బోనాలను సమర్పించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి గోల్కొండ కోటకు భక్తులు వేలాదిగా తరలివచ్చారు.



# ఆరు ప్రాజెక్టులపై ఫోకస్..

- తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆయకట్టుకు నీరు
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్ణయం

హైదరాబాద్,(నమస్తే ఉదయం): రాష్ట్రంలో అసంపూర్తిగా ఉన్న పలు సాగునీటి ప్రాజెక్టులను వీలైనంత తొందరగా వినియోగం లోకి తీసుకురావాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంకల్పించారు. ఇప్పటికే నిధులు ఖర్చు పెట్టినవి.. అసంపూర్తిగా ఉన్నవి.. గత ప్రభుత్వం నిర్లక్ష్యంగా వదిలేసిన సాగునీటి ప్రాజెక్టులను రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని కీలక నిర్ణయం తీసుకున్నారు. వీటిలో తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆయకట్టుకు సాగునీటిని అందించే ప్రాజెక్టులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి కేంద్రీకరించారు. అటు గోదావరి బేసిన్‌తో పాటు ఇటు కృష్ణా బేసిన్‌లో అర్థాంతరంగా ఆగిపోయిన ప్రాజెక్టుల వివరాలన్నీ ఇరిగేషన్ ఇంజనీర్ల నుంచి ఆరా తీశారు.

రైతులకు సాగునీటిని అందించాలంటే ఆయకట్టు భూములకు నీళ్లను పా రించే డిస్ట్రిబ్యూటరీ వ్యవస్థలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సిఎం అధికారులను ఆదేశించారు. గత ప్రభుత్వం పదేండ్లలో చేపట్టిన ప్రాజెక్టులన్నీ బ్యారేజీలు, పంప్ హౌజులకే పరిమితమయ్యాయి. భారీగా

మిగతా.. 2లో



## ట్రాఫిక్ ఫ్రీ సిటీకి సర్వే షురూ..

- ట్రాఫిక్ లేని మెరుగైన రవాణా వ్యవస్థకు ఉమ్టా ప్రణాళికలు 2054 అవసరాలకు అనుగుణంగా
- సమగ్ర మొబిలిటీ ప్రణాళిక అధ్యయనాన్ని ప్రారంభించిన ఉమ్టా ఓ సంస్థకు సర్వే బాధ్యతలు

హైదరాబాద్, జూలై 7(నమస్తే ఉదయం): నగరం నలుమూలాల శరవేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో ట్రాఫిక్ ఇక్కట్లు లేకుండా ఉండేందుకు ఆధునిక ప్రజా రవాణా వ్యవస్థను పట్టాలెక్కించడానికి ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. మెట్రో రైలు తరహాలో కాలుష్య రహితంగా ఉండే రవాణా వ్యవస్థలను అం దుబాటులోకి తీసుకు రావాలని ప్రభు త్వం సంకల్పించింది. దానికి అనుగుణంగానే మహానగరాన్ని దాని శివారు ప్రాంతాల్లో స మగ్ర పట్టణ ప్రజా రవాణా ప్రణాళికను అ భివృద్ధి చేయడమే లక్ష్యంగా హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్‌ఎండిఏ) చర్యలు చేపడుతోంది. విదేశాలను తలపించేలా ఆధునిక

మిగతా.. 2లో

## ఇస్కాన్ జగన్నాథునికి సిఎం రేవంత్ రెడ్డి పూజలు

- ఇస్కాన్ సంస్థ ఒక మంచి కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది
- సర్వమతాలకు స్వేచ్ఛ, అవకాశాలను కల్పిస్తుంది
- మానవ సేవే మాధవ సేవ అన్న సందేశం అందరికీ చేరేలా ప్రభుత్వం కృషి
- ఎన్టీఆర్ స్టేడియం వద్ద జగన్నాథ రథయాత్రను ప్రారంభించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

హైదరాబాద్, జూలై 7(నమస్తే ఉదయం): ఇస్కాన్ టెంపుల్ ఆధ్వర్యంలో జరిగే జగన్నాథ రథ యాత్రను సిఎం రేవంత్ రెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఎన్టీఆర్ స్టేడియం నుంచి నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్



వరకు ఈ రథయాత్ర కొనసాగింది. జగన్నాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం సిఎం ఈ రథయాత్రను ప్రారంభించారు. అనంతరం సిఎం మాట్లాడుతూ జగన్నాథ

మిగతా.. 2లో



## తెలంగాణలో టీడీపీ పునర్నిర్మాణం..

- ఆంధ్రప్రదేశ్, తెలంగాణ.. నాకు రెండు కళ్లు
- రేవంత్ పాలనలో అభివృద్ధిలో తెలంగాణ
- నేను జైల్లో ఉన్నప్పుడు గచ్చిబౌలిలో పెట్టిన సభను ఎప్పటికీ మరువను: బాబు
- ఎన్టీఆర్ భవన్‌లో టీడీపీ అధినేతను ఘనంగా సన్మానించిన నేతలు
- చంద్రబాబును కలిసిన మంత్రి తుమ్మల బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ప్రకాశ్‌గౌడ్, అరికెపూడి గాంధీ కూడా..

హైదరాబాద్, జూలై 7(నమస్తే ఉదయం): తెలంగాణలో టీడీపీని పునర్నిర్మిస్తామని ఆ పార్టీ అధినేత, ఏపీ సీఎం చంద్రబాబు ప్రకటించారు. పార్టీకి యువ రక్తాన్ని ఎక్కిస్తామని, విద్యావంతులకు అవకాశం ఇస్తామని, మూడు నాలుగు దశాబ్దాలు పార్టీ ఉత్సాహంగా పని చేసేలా సమర్థనాయకత్వాన్ని తీసుకొస్తామని వెల్లడించారు. తెలంగాణలో పార్టీ బలోపేతం

మిగతా.. 2లో



- ఈడీ కేసులున్న నేతలు బీజేపీలోకి రారు
- రామాయణ్ సర్క్యూట్ కింద కొండగట్టు, ఇల్లందకుంట ఆలయాల అభివృద్ధి
- కరీంనగర్- హసన్ పర్తి రైల్వే లేన్ సర్వే పూర్తి
- అధ్యక్ష మార్పు అంశం హైకమాండ్ పరిధిలోనిది
- కరీంనగర్ పార్లమెంట్ అభివృద్ధి కోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తా
- కరీంనగర్ మీడియాతో ఇష్టాగోష్టిలో కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్

## బీజేపీలోకి రావాలంటే రాజీనామా చేయాల్సిందే

కరీంనగర్, (నమస్తే ఉదయం): ఇతర పార్టీల తరపున గెలిచిన ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు బీజేపీలోకి రావాలంటే తప్పనిసరిగా ఆ పదవులకు రాజీనామా చేయాల్సిందేనని కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తెలిపారు. ఈడీ, సీబీఐ కేసులున్న నేతలను బీజేపీలోకి తీసుకునే అవకాశాల్లేవని చెప్పారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజక వర్గంలోని కొండగట్టు, ఇల్లందకుంట ఆలయాలను రామాయణ్ సర్క్యూట్ కింద అభివృద్ధి చేసే అవకాశాలున్నాయని చెప్పారు. కరీంనగర్– హసన్‌పర్తి రైల్వే లేన్ సాధ్యాసాధ్యాలపై రూ.20 కోట్లతో చేపట్టిన సర్వే పనులు పూర్తయ్యాయన్నారు.కరీంనగర్‌లోని ఎంపీ కార్యాలయంలో బండి సంజయ్ మీడియాతో

మిగతా.. 2లో

# గోల్కొండ జగదాంబిక అమ్మవారికి తొలి బోనం..

## ఆషాఢ మాసం బోనాలు షురూ

**గోల్కొండ,జులై 07(నమస్తే ఉదయం):**
ఆషాఢ మాస బోనాల ఉత్సవాలు నగరంలో ఆదివారం ప్రారంభమయ్యాయి.చారిత్రక గోల్కొండ కోటలో కొలువుదీరిన జగదాంబిక మహంకాళి ఎల్లమ్మకు తొలి బోనం సమర్పించి..బోనాల ఉత్సవాలు ప్రారంభించారు.9 వారాల పాటు బోనాల ఉత్సవాలు జరుగుతాయి.గోల్కొండ కోటలోనే బోనాలు ముగిస్తాయి.అమ్మవారిని దర్శించుకునేందుకు తెలంగాణ రాష్ట్రం నుంచే కాకుండా కర్ణాటక,మహారాష్ట్రలతో పాటు దేశ, విదేశాల సందర్శకులు తరలివస్తున్నారు.ప్రతి ఆదివారం,గురువారం జగదాంబిక అమ్మవారికి బోనాలు సమర్పిస్తారు.అమ్మవారికి రాష్ట్ర మంత్రులు పట్టువస్త్రాలు సమర్పించనున్నారు.ప్రభుత్వం తరఫున మంత్రులు బోనాలను అధికారికంగా ప్రారంభించి..అనంతరం అమ్మవారికి పట్టు వస్త్రాలను అందజేస్తారు.లంగర్ హౌస్ నుంచి అమ్మవారికి సమర్పించడానికి పట్టు వస్త్రాల ఊరేగింపు,తొట్టెల ఊరేగింపుగా గోల్కొండ కోట వరకు కొనసాగుతాయి.గోల్కొండ చోటా బజార్‌లో దిగంబర్ పంతులు ఇంట్లో అమ్మవారిని ఆభరణాలతో అలంకరించి..గోల్కొండ కోటపై ఉన్న ఆలయం వరకు ఊరేగించి తొట్టెలను సమర్పిస్తారు.ఈ కార్యక్రమం మొత్తం దేవాదాయశాఖ ఆధ్వర్యంలో కొనసాగుతుంది.లంగర్‌హౌస్ చౌరస్తాలో బోనాలను ప్రభుత్వం తరఫున స్పీకర్ గడ్డం ప్రసాద్,మంత్రులు పొన్నం ప్రభాకర్,కొండ సురేఖ,ఎమ్మెల్యే దానం నాగేందర్,నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మిలతో కలిసి ప్రారంభిస్తారని గోల్కొండ బోనాల ఉత్సవ కమిటీ చైర్మన్ కాంత అరవింద్ మహేశ్‌కుమార్ తెలిపారు.చారిత్రక గోల్కొండ జగదాంబిక మహంకాళి ఎల్లమ్మ ఆలయంలో నెల రోజుల పాటు జరిగే ఆషాఢ మాసం బోనాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తామన్నారు.



### భారీ పోలీస్ బందోబస్తు..

గోల్కొండ బోనాల కోసం భారీ బందోబస్తు ఏర్పాట్లు చేశామని దక్షిణ,పశ్చిమ మండలం డీసీపీ ఉదయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. బోనాలను ప్రతిష్టాత్మకంగా నిర్వహించడం కోసం 600 మంది పోలీస్ సిబ్బందిని వినియోగిస్తున్నామని,సీసీ కెమెరాల నిఘాలో బోనాలను పర్యవేక్షిస్తున్నామని చెప్పారు. గోల్కొండ కోటకు వచ్చే వారికి మూడు ప్రాంతాల్లో పార్కింగ్ ఉంటుందని,సెవన్ టూంబ్స్ వద్ద ఓ పార్కింగ్,లంగర్‌హౌస్ హుడా పార్కు వద్ద పార్కింగ్, రాందేవ్‌గూడ దాటిన తర్వాత ఓ పార్కింగ్ ప్రదేశాన్ని కేటాయించామని తెలిపారు. అంతేకాకుండా సెవన్ టూంబ్స్,రాందేవ్‌గూడల వైపు నుంచి వచ్చే వారికి పార్కింగ్ దగ్గర నుంచి కోట వరకు ఉచిత సెట్విన్ బస్సు,లంగర్‌హౌస్ హుడా పార్కు నుంచి వచ్చే వారి కోసం ఫ్రీ ఆటోలను పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నడుపుతున్నట్లు డీసీపీ ఉదయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు.ప్రజలందరూ పోలీసులకు సహాయ సహకారాలు అందించి ప్రశాంత వాతావరణంలో బోనాలను జరుపుకోవాలన్నారు.



పాలమూరు ఎంపీ డీకే అరుణను కలిసిన బిజెపి నాయకులు శంకర్ రెడ్డి

# డికే అరుణను మర్యాదపూర్వకంగా కలిసిన కోలన్ శంకర్ రెడ్డి బృందం

**రంగారెడ్డి,జులై 07(నమస్తే ఉదయం):**
బిజెపి జాతీయ ఉపాధ్యక్షురాలు,మహబూబ్ నగర్ పార్లమెంట్ సభ్యులు డికే అరుణ నూతనంగా ఎన్నికైనా శుభ సందర్భంగా ఆదివారం ఆమె నివాసంలో బిజెపి రాష్ట్ర సీనియర్ నేత,మాజీ సింగల్ విండో చైర్మెన్ కోలన్ శంకర్ రెడ్డి బృందం మర్యాద పూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా డికే అరుణను శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సన్మానించి సత్కరించారు.

స్వీట్లు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా బిజెపి నేత కోలన్ శంకర్ రెడ్డి మాట్లాడుతూ...రాష్ట్ర ముఖ్యమంత్రి అడ్డాను డీకే అరుణ బద్దలు కొట్టారన్నారు.ప్రదాని మోదీ దేశ మహిళలకు చట్ట సభలలో 33 శాతం రిజర్వేషన్లు ఇచ్చిన గొప్ప యుగపురుషుడని తెలిపారు.ఈ కార్యక్రమములో బిజెపి నాయకులు పాల్గొన్నారు.

# ఆరు ప్రాజెక్టులపై ఫోకస్..

(మొదటి పేజీ తరువాయి)

అప్పులు తెచ్చి కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టు నిర్మించటం తప్ప మెయిన్ కాల్వలు, డిస్ట్రిబ్యూటరీలు, ఆయకట్టుకు నీటిని అందించే కా ల్వలు నిర్మించకుండానే వదిలేసింది. అదే తరహాలో గత ప్రభుత్వం చేపట్టిన చాలా ప్రాజెక్టులు అసంపూర్తిగా మిగిలిపోయాయి. ఇటీవల పలు దఫాలుగా ఈ ప్రాజెక్టులపై చర్చించిన ముఖ్య మంత్రి తక్కువ ఖర్చుతో పూర్తయ్యే ప్రాజెక్టులు, వీలైనంత తొందరగా సాగునీటిని అందించేందుకు వీలున్న ప్రాజెక్టులను చేపడితే రైతులకు మేలు జరుగుతుందని, అందుకు అవసరమైన అంచనాలు సిద్ధం చేయాల ని అధికారులకు సూచించారు. ఇందులో భాగంగా గోదావరి బేసిన్‌లో ఉన్న నీల్వాయి ప్రాజెక్ట్, పింప్రి ప్రాజెక్టు, పాలెం వాగు, మత్తడి వాగు, ఎస్ఆర్ఎస్‌పి స్టేజీ 2, సదర్మట్ ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేయాలని నిర్ణయించారు.

ఈ ప్రాజెక్టులకు సంబంధించి పనులు పూర్తి చేసేందుకు దాదాపు రూ.241 కోట్లు ఖర్చవుతుందని, దాదాపు 48 వేల ఎకరాల ఆయకట్టుకు నీరు అందుతుందని ఇరిగేషన్ విభాగం అంచనాలు రూపొందించింది. తక్కువ నిధులతో పూర్తయ్యే ఈ ప్రాజెక్టుల పనులను వీలైనంత తొందరగా పూర్తి చేపట్టాలని, వచ్చే ఏడాది 2025 మార్చి నాటికి వందకు వంద శాతం పనులు పూర్తి చేయాలని సిఎం రేవంత్‌రెడ్డి నిర్ణయం తీసుకున్నారు. అందుకు వీలుగా నిర్ణీత గడువు నిర్దేశించుకోవాలని, ఆయకట్టుకు నీరందించే లక్ష్యంతో సమగ్ర ప్రణాళిక తయారు చేయాలని సిఎం అధికారులను ఆదేశించారు. నీల్వాయి ప్రాజెక్ట్ ద్వారా మంచిర్యాల జిల్లా, పింప్రి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ ద్వారా నిర్మల్ జిల్లా, పాలెం వాగుతో జయశంకర్ భూపాలపల్లి జిల్లా, మత్తడివాగుతో ఆదిలాబాద్ జిల్లా, ఎస్సారెస్పీ స్టేజీ 2తో వరంగల్, మహబూబా బాద్, ఖమ్మం, జనగాం, సూర్యాపేట జిల్లాలకు, సదర్మట్ ప్రాజెక్టుతో నిర్మల్ జిల్లాలోని రైతులకు సాగునీరు అందుతుంది.

# రాజేంద్రనగర్‌లో ఘనంగా ఎమ్మార్పీఎస్ 30వ ఆవిర్భావ దినోత్సవం

## ఎస్సీ వర్గీకరణ కోసం ఉద్యమించాలి: వనం నరసింహ మాదిగ

**రాజేంద్రనగర్,జులై 07(నమస్తే ఉదయం):**
రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో ఆదివారం 30వ ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఎమ్మా ర్పీఎస్ నేతలు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు.ఈ సందర్భంగా శ్రీరామ్ నగర్ చౌరస్తాలో జెండా ఎగిరేసి కేక్ కట్‌చేసి స్వీట్లు పంచిపెట్టారు.అలాగే మందకృష్ణ మాదిగకు జన్మదిన శు భాకాంక్షలు తెలియజేశారు.

ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ నాయ కులు మాట్లాడుతూ... మందకృష్ణ మాదిగ 60వ జన్మదినాన్ని పురస్కరించుకుని ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల ఆద్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. మందకృష్ణమాదిగ ఆలుపెరుగని పోరాట యోధుడని,బహుజన నాయకుడిగా అనేక ఉద్యమాలు చేసి పేదల పక్షాన నిలిచాడన్నారు.ఎస్సీ ఎస్సీ వర్గీకరణ కోసం ప్రతి మాదిగ బిడ్డ మందకృష్ణ మాదిగను స్ఫూర్తిగా తీసుకుని ఉద్యమించాలని పేర్కొన్నారు. మాదిగల అభివృద్ధికోసం మందకృష్ణ మాదిగ రాజీలేని పోరాటం చేస్తున్నారన్నారు.గత 30సంవత్సరాలుగా ప్రజల విశ్వాసాన్ని ఆధార అభిమానాలను పొంది సుదీర్ఘకాలంగా నిలబడిన రాజకీయేతర ఏకైక సామాజిక ఉద్యమం ఎమ్మార్పీఎస్ ఉద్యమం అని అన్నారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు వనం నరసింహ మాదిగ,కె.శంకర్ రావు,రాజేంద్రనగర్ సర్కిల్ ఎమ్మార్పీఎస్ ఉపాధ్యక్షులు లింగని కృష్ణ,బీజేపీ ఎస్సీ మోర్చా చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్ జోగి రవి,ఎడ్లకాడి సూర్యం,ఎస్టీ మోర్చ మైలార్ దేవులపల్లి డివిజన్ ప్రధాన కార్యదర్శి పట్లవత్ రామారావు,ఎస్సీ మోర్చా డివిజన్ ప్రధాన కార్యదర్శి ఆదిమూల చంద్రశేఖర్, బాల స్వామి, వెంకటయ్య, మాధవులు,అరుణ్ హరినాథ్,ఉపకులాల నాయ కులు తదితరులు పాల్గొన్నారు.



**ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా రాజేంద్రనగర్లో జెండా ఎగరవేస్తున్న ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వనం నరసింహ మాదిగ**

# బీజేపీలోకి రావాలంటే రాజీనామా చేయాల్సిందే

(మొదటిపేజీ తరువాయి..)

ఇష్టాగోష్టిగా ముచ్చటించారు. విలేకరులు అడిగిన పలు ప్రశ్నలకు బదులిచ్చారు. అందులోని ముఖ్యాంశాలు.

విభజన చట్టంలోని అంశాలపై రెండు రాష్ట్రాల సీఎంల భేటీపై గత కేసీఆర్ ప్రభుత్వం విభజన చట్టంలోని పలు అంశాలకు పరిష్కారం లభించే అవకాశాలు ఉన్నా రాజకీయ లబ్ది కోసం మరింత జఠిలం చేసి సమస్యను నాన్చుతూ వచ్చారు. ఇప్పుడు ఆ అవసరం లేదు. రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులు సఖ్యతతో ఉన్నారు. చిత్తశుద్ధితో వ్యవహరిస్తే విభజన సమస్యల పరిష్కారం లభించే అవకాశముంది. ఇప్పటికే కేసీఆర్ గోతికాడ నక్కలా ఈ భేటీని అడ్డం పెట్టుకుని మళ్లీ ప్రజలను ఎట్లా రెచ్చగొట్టాలా? అని ప్రయత్నిస్తున్నారు. ఆ అవకాశం ఇవ్వొద్దని ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులను కోరు తున్నా. సీఎంలు చర్చించుకున్న విషయాలు మా దృష్టికి రావాలి కదా. రెండు రాష్ట్రాలు సానుకూలంగా ఉండడం మంచిది

### ఈడీ కేసులు, ఇతర పార్టీల ఎమ్మెల్యేల చేరికపై..

ఈడీ, సీబీఐ సంస్థల విచారణకు, బీజేపీకి సంబంధమే లేదు. నరేంద్రమోదీ ప్రభుత్వం అవినీతి పరులను ఉపేక్షించే ప్రసక్తే లేదు. ఈడీ కేసులున్న వాళ్లు, ఈడీ, సీబీఐ విచారణ ఎదుర్కొంటున్న నేతలు బీజేపీ లోకి వచ్చే అవకాశాలు లేవు. ఇతర పార్టీల నుండి గెలిచిన ఎమ్మెల్యేలు కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల్లో మాదిరిగా రాజీనామా చేయకుండా బీజేపీలోకి వచ్చే అవకాశమే లేదు. బీజేపీలోకి రావాలంటే రాజీనామా చేసి రావాల్సిందే. ఎంపీ కేశవరావుతో రాజీనామా చేయించిన కాంగ్రెస్ నేతలు ఆ పార్టీలో చేరిన ఇతర పార్టీల ఎమ్మెల్యేలతో ఎందుకు రాజీనామా చేయించలేదు? కాంగ్రెస్ పాలన నిజంగా బాగుంటే పార్టీ ఫిరాయించే ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించి ప్రజా తీర్పు కోరాలి. ఒకవేళ ఉప ఎన్నికలు జరిగితే కచ్చితంగా అన్ని స్థానాల్లో బీజేపీయే గెలుస్తుంది.

### అధ్యక్ష మార్పుపై..

స్టేట్ ప్రెసిడెంట్ మార్పు, నూతన అధ్యక్షుడి ఎంపిక అంశం పార్టీ జాతీయ నాయకత్వం చూసుకుంటుంది. కొత్త నేతలకు అధ్యక్ష పదవి ఇవ్వకూడదనే నిబంధన ఏమీ లేదు. ఒక్కో రాష్ట్రంలో ఒక్కో విధమైన పరిస్థితులుంటాయి. ఆ పరిస్థితులకు అనుగుణంగా ఎవరిని అధ్యక్షుడిని చేయాలనే దానిపై అన్నీ ఆలోచించి జాతీయ నాయకత్వం నిర్ణయం తీసుకుంటుంది.

### రామాయణ్ సర్క్యూట్, కరీంనగర్హసన్ పర్తి రైల్వే లేన్‌పై..

రామాయణ సర్క్యూట్ కింద ఇల్లంతకుంట ,కొండగట్ట అలయాలను అభివృద్ధి చేసే అవకాశం ఉంది. అందుకోసం నేను తప్పకుండా క్రుషి చేస్తా. ఎములాడ రాజన్న ఆలయాన్ని ప్రసాద్ స్కీంలో చేర్చుతాం.. ప్రతిపాదనలు పంపాలని గత ప్రభుత్వాన్ని అనేకమార్లు కోరినా కేసీఆర్ మూర?ంగా వ్యవహరించారు. కనీసం ప్రతిపాదనలు కూడా పంపలేదు.

కరీంనగర్-హాసన్‌పర్తి రైల్వేలైన్ నిర్మాణానికి సంబంధించి సర్వే జరిగింది. రైల్వే లైన్ వస్తే ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుంది. త్వరలోనే రైల్వే లేన్ నిర్మాణంపై నిర్ణయం జరుగుతుంది. సీఎం రేవంత్ రెడ్డి అడిగితే స్మార్ట్ సిటీ మిషన్ గడువు పొడిగించలేదు.

రాజస్తాన్, మధ్యప్రదేశ్ సహా దేశవ్యాప్తంగా అనేక రాష్ట్రాల నుండి వచ్చిన విజప్తుల మేరకే కేంద్రం గడువు పొడిగించింది. గడువు పొడిగింపుతో కరీంనగర్ కార్పొరేషన్ కు మరిన్ని నిధులు వచ్చే అవకాశముంది. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధి కోసం శక్తివంచన లేకుండా పనిచేస్తా.



# ఇస్కాన్ జగన్నాథునికి సిఎం రేవంత్ రెడ్డి పూజలు

(మొదటి పేజీ తరువాయి)

రథయాత్రను నిర్వహించటంలో భాగస్వామ్యం కావడం ప్రభుత్వ బాధ్యత అని, ఈ కార్యక్రమంలో పాల్గొనడం తనకు మంచి అనుభూతిని కలిగిస్తుందని సిఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఇస్కాన్ సంస్థ ఒక మంచి కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిందని, ఈ ప్రభుత్వం అందరిదని, సర్వమతాలకు స్వేచ్ఛ, అవకాశాలను ఇస్తుందన్నారు. తమ ప్రభుత్వం మత సామరస్యాన్ని పాటిస్తుందని, ఇస్కాన్ సంస్థ ప్రార్థనలతో రాష్ట్రం సుఖశాంతులతో వర్ధిల్లాలని కోరుకుంటున్నానని ఆయన తెలిపారు. మానవ సేవే మాధవ సేవ అన్న సందేశం అందరికీ చేరేలా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఇలాంటి మంచి కార్యక్రమాలకు ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం ఎప్పుడూ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమం సందర్భంగా పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. రథయాత్ర జరిగే మార్గంలో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు.

# ట్రాఫిక్ ఫ్రీ సిటీకి సర్వే షురూ..

(మొదటి పేజీ తరువాయి)

ప్రజా రవాణా వ్యవస్థను అందుబాటులోకి తీసుకు రావాలన్నది ప్రభుత్వం సంకల్పం.

దానికి అనుగుణంగానే మహానగరాన్ని దాని శివారు ప్రాంతాల్లో సమగ్ర పట్టణ ప్రజా రవాణా ప్రణాళికను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా హెచ్ఎండిఏ ప్ర ణాళికలు రూ పొందిస్తోంది. తద్వారా శివారు ప్రాంతా ల్లో పట్టణీకరణకు అనుకూలమైన వాతావరణం ఏర్పడుతుందని హెచ్ఎండిఏ భావిస్తోంది. ఇందుకోసం హెచ్ఎండిఏ పరిధిలో పనిచేస్తున్న యూనిఫైడ్ మెట్రోపాలిటన్ ట్రాన్స్‌ఫోర్టేషన్ అథారిటీ (ఉమ్టా) ఎప్పటికప్పుడు గ్రేటర్‌తో పాటు శివారు ప్రాంతాల్లో ప్రజా రవాణా వ్యవస్థలపై అధ్యయనం చే స్తూ, భవిష్యత్‌లో ప్రజలకు మెరుగైన రవా ణా వ్యవస్థలను అందుబాటులోకి తీసుకొచ్చేలా చర్యలు తీసుకుంటోంది. ఈ నేపథ్యంలోనే 2054 అవసరాలకు అనుగుణం గా నగరం నుంచి ఔటర్ రింగ్ రోడ్డు వరకు మెరుగైన రవాణా అందించేలా ఉమ్టా కసరత్తు ప్రారంభించింది. హెచ్ఎండిఏ ఏరి యా పరిధిలో వివిధ రకాల రవాణా వ్యవస్థను సమన్వయం చేయడం, వాటి పనితీరును సమర్థవంతంగా తీర్చిదిద్దడమేల క్ష్యంగా ఉమ్టా పనిచేస్తోంది. భవిష్యత్ మ హానగ రాలకు కావాల్సింది అన్ని అంశాలతో కూడిన ప్రణా ళికాబద్ధమైన పట్టణీకరణ లక్ష్యంతో ప్రస్తుతం హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ పనిచేస్తోంది.

టౌన్‌ప్లానింగ్, ఇంజనీరింగ్, అర్బన్ ఫారెస్ట్, లేక్ ప్రొటెక్షన్, అర్బన్ ట్రాన్స్‌ఫోర్టేషన్ ఇలా వివిధ విభాగాలు హెచ్ఎండిఏ పరిధిలో ప్రణాళికాబద్ధమైన పట్టణీకరణ జరిగేలా పనిచేస్తున్నాయి.

ఈ నేపథ్యంలోనే రానున్న రోజుల్లో ట్రాఫిక్‌కు చెక్ పెట్టేలా ప్రజా రవాణాను అందుబాటులోకి తెచ్చేలా చర్యలు చేపడుతోంది. ముఖ్యంగా ప్రజారవాణా వ్యవస్థలో రోడ్డు, రైలు, మె ట్రో మార్గాలతో పాటు అభివృద్ధి చెందిన నగరాల్లో ఉన్న పట్టణ ప్రజా రవాణా వ్యవస్థలను అధ్యయనం చేయడం, వాటిని నగరంలో ఏ ప్రాంతాల్లో అందుబాటులోకి తీ సుకురావాలన్న దానిపై ఉమ్టా కసరత్తు మొదలు పెట్టింది. ముఖ్యంగా శివారు ప్రాం తాల వరకు మెరుగైన ప్రజా రవాణా వ్యవస్థ ఉంటేనే నగరం మరింత విస్తరించేందుకు అవకాశం ఉంటుంది. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకునే హెచ్ఎండిఏ కార్యాచరణను రూపొందించే పనిలో పడింది. దీనికోసం అన్ని రకాల చర్యలను చేపడుతోంది.

### ఐటీ కారిడార్‌లో రోజు రోజుకు పెరుగుతున్న రద్దీ

2031లో రూపొందించిన హెచ్ఎండిఏ మాస్టర్‌ప్లాన్‌కు అనుగుణంగా ఉన్న రోడ్ల విస్తరణే కాకుండా కొత్తగా జన సాంద్రత ఉన్న ప్రాంతాలు, భవిష్యత్‌లో అభివృద్ధి చెందే ప్రాంతాలను పరిగణలోకి ఆధునిక రవాణా వ్యవస్థలను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ఉమ్టా అధ్యయనం చేస్తోంది. అందులో భాగంగా 2054 అవసరాల అనుగుణంగా నగరం ఔటర్ రింగ్ రోడ్డును హద్దుగా చేసుకొని విస్తరిస్తున్న నేపథ్యంలో సమగ్ర మొబిలిటీ ప్లాన్‌ను సిద్ధం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం హెచ్ఎండిఏకు ఆదేశాలిచ్చింది. ఈ నేపథ్యంలోనే హెచ్ఎండిఏలోని ఉమ్టా విభాగం ఆధ్వర్యంలో ఈ ప్లాన్ రూపకల్పన కోసం 'లీ అసోసియేట్'ను కన్సల్టెన్సీగా నియమించి సర్వే ప్రారంభించింది. ఈ సర్వేలో గ్రేటర్ హైదరాబాద్‌తో పాటు విస్తరిస్తున్న ప్రాంతాల్లో పూర్తి స్థా యిలో ట్రాఫిక్‌పై పూర్తిగా అధ్యయనం చేయనున్నారు.

దీంతోపాటు ప్రపంచ వ్యాప్తం గా ఉన్న ఆధునిక ప్రజా రవాణా వ్యవస్థలను అధ్యయనం చేయడంతో పాటు వాటికన్నా మరింత మెరుగైన పట్టణ ప్రజా రవాణా వ్యవస్థలు ఎక్కడ ఉన్నాయో గుర్తించే పనిలో ఉమ్టా నిమగ్నమై ఉంది. ముఖ్యంగా ఐటీ కారిడార్‌లో రోజు రోజుకు పెరుగుతున్న రద్దీని దృష్టిలో పెట్టుకొని ఆ ప్రాంతానికి అనుగుణంగా అత్యాధునిక శైలిలో ఉండేలా, సులభంగా, పర్యావరణ హితంగా ఉండేలా వాహనదారులు సులభంగా త మ గమ్యస్థానాలకు చేరుకునేలా ఉమ్టా కార్యాచరణను సిద్ధం చేసింది.

బస్సు, మెట్రో, ఎంఎంటిఎస్ ఇలా ప్రజా రవాణాను వినియోగించుకునే వారికి లాస్ట్ మైల్ కనెక్టివిటీ ఉండేందుకు తీసుకోవాల్సిన చర్యలపై కూడా 'లీ అసోసియేట్' తగిన సూచనలను చేయనుంది.

మల్టీమోడల్ ఇంటిగ్రేషన్ ప్రాజెక్టును ప్రభుత్వం చేపట్టేందుకు తగిన ప్రణా ళికను ఈ సంస్థ అందజేయనుంది. ఈ సర్వేను పూర్తిస్థాయిలో నిర్వహించి ఏడాదిలో సమగ్ర నివేదికను ఈ సంస్థ అందజేయనుంది.

# తెలంగాణలో టీడీపీ పునర్నిర్మాణం..

(మొదటి పేజీ తరువాయి)

కోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని వివరించారు. "ఎన్నికల్లో పోటీచేయక పోయినా పెద్దఎత్తున కార్యకర్తలు తరలిరావడం చూస్తుంటే తెలంగాణలో పార్టీ బలం ఏమిటో తెలుస్తోంది. 20 ఏళ్లుగా అధికారంలో లేకున్నా కార్యకర్తల్లో అభిమానం, పట్టుదల ఉంది. తెలుగుజాతి ఉన్నంతవరకు తెలంగాణ గడ్డపై పసుపుజెండా ఎగురుతూనే ఉంటుంది.

ఏపీలో పరిస్థితులను సెట్ చేసిన తర్వాత ఇక్కడకు వస్తా" అని వివరించారు. ఏపీ సీఎంగా మరో సారి బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారి హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ భవన్‌కు వచ్చిన చంద్రబాబుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. అంతకుముందు జూబ్లీహిల్స్‌లోని చంద్రబాబు నివాసం నుంచి ఎన్టీఆర్ భవన్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో చంద్రబాబు మాట్లాడుతూ తనకు పునర్జన్మ అంటూ ఉంటే తెలుగు గడ్డపైనే పుట్టాలని భగవంతుడిని కోరుకుంటానన్నారు. అన్నదమ్ములుగా విడిపోయినా రెండు తెలుగు రాష్ట్రాల అభివృద్ధే టీడీపీ లక్ష్యమని స్పష్టం చేశారు. ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలు పరస్పరం సహకరించుకుంటూ అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. "రెండు రాష్ట్రాల మధ్య ఉన్న విభజన సమస్యలపై చర్చించేందుకు నేను చొరవ తీసుకుని తెలంగాణ సీఎం రేవంత్‌కు లేఖ రాస్తే.. ఆయన తక్షణమే స్పందించారు. ఇందుకు ఆయన్ను అభినందిస్తున్నా.

ఏపీ, తెలంగాణాలో వేర్వేరు ప్రభుత్వాలు ఉన్నాయి. సైద్ధాంతికంగా వైరుధ్యాలున్నా తెలుగు జాతి అభ్యున్నతే లక్ష్యంగా శనివారం రెండు రాష్ట్రాల మధ్య చర్చలు ప్రారంభమయ్యాయి. భవిష్యత్తులో అధికారులతో కమిటీలు ఏర్పాటు చేసి, సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకోవాలని నిర్ణయించాం" అని వివరించారు. తెలంగాణ, ఏపీ తనకు రెండు కళ్లు అని పేర్కొంటూ, రెండు రాష్ట్రాల అభివృద్ధిని తాను కోరుకుంటానని చెప్పారు. 2047నాటికి వికసిత్ భారత్ లక్ష్యంగా ప్రధాని మోదీ పని చేస్తున్నారని, ఆ పరంపరలో తెలుగు జాతి నంబర్ వన్‌గా నిలవాలని ఆకాంక్షించారు. ఎన్టీఆర్, పీవీ నర్సింహారావు తెలుగు బిడ్డలు కావడం మనకు గర్వకారణమని పేర్కొన్నారు.

### సీఎం రేవంత్‌కు ప్రశంసలు

తెలంగాణ రాష్ట్రాన్ని సీఎం రేవంత్‌రెడ్డి అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్నారని చంద్రబాబు ప్రశంసించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో దూరదృష్టితో తాను చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ఆ తర్వాత వచ్చిన సీఎంలు కొనసాగించడం అభినందనీయమన్నారు. సైబరాబాద్ అని మాట్లాడితే ఆ రోజు తనను ఎగతాళి చేశారని, కానీ.. ఇప్పుడు ఆ అభివృద్ధి ఫలాలు యువతకు అందుతున్నాయని పేర్కొన్నారు. తనను అక్రమంగా జైల్లో పెట్టినప్పుడు సంఘీభావంగా ఇక్కడ ఆందోళనలు నిర్వహించారని, ముఖ్యంగా గచ్చిబౌలిలో నిర్వహించిన సభను జీవితంలో మరచిపోలేనని చెప్పారు. "విభజన సమయానికి (2014లో) తలసరి ఆదాయం పరంగా చూస్తే ఏపీ కంటే 35 శాతం ముందంజలో తెలంగాణ ఉంది. 2014-19 వరకు ఏపీ సీఎంగా తాను పనిచేసిన సమయంలో ఈ వ్యత్యాసాన్ని 27.5శాతానికి తగ్గించాను. ఏపీలో గడచిన ఐదేళ్లలో విధ్వంస పాలన కారణంగా ఈ వ్యత్యాసం 44శాతానికి చేరింది. ఒకవేళ పొరపాటున మొన్నటి ఎన్నికల్లో కూటమి గెలువకపోతే ఈ వ్యత్యాసం వంద శాతానికి పెరిగేది" అని వ్యాఖ్యానించారు. తలసరి ఆదాయంలో గుజరాత్, మహారాష్ట్ర, కర్ణాటక కంటే తెలంగాణ(రూ.3,08,732) ముందంజలో ఉందని పేర్కొంటూ, ఏపీ తలసరి ఆదాయం రూ.2,19,518గా ఉందని వివరించారు.

## రంగారెడ్డి జిల్లా మహిళా మోర్చా కార్యదర్శిగా కోడూరి కుమారి

**శంషాబాద్, జూలై 7( ప్రభాత ఉదయం):**
బిజెపి రంగారెడ్డి జిల్లా మహిళా మోర్చా కార్యదర్శిగా తొండుపల్లికి చెందిన కోడూరి కుమారి నియమితులైనారు. ఈ మేరకు రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు బొక్క నర్సింహా రెడ్డి, రంగారెడ్డి జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు రమాదేవి. కోడూరి కుమారి కి నియామక పత్రాన్ని అందజేసినారు. తొండుపల్లిలో పార్టీ బలోపేతం కోసం కుమారి ఎంతగానో కృషి చేశారు.



ఈ సందర్భంగా కోడూరి కుమారి మాట్లాడుతూ రంగారెడ్డి జిల్లాలో మహిళా మోర్చాను బిజెపి పార్టీని మరింత బలోపేతం చేసేందుకు తన శాయశక్తిలా కృషి చేస్తానని తెలియజేసినారు. తనపై ఎంతో నమ్మకంతో ఈ పదవిని అందజేసిన రాష్ట్ర జిల్లా మండల సీనియర్ నాయకులకు కార్యకర్తలకు ఈ సంద ర్భంగా ఆమె కృతజ్ఞతలు చెప్పారు.

## చంద్రబాబుతో ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్ భేటీ..

**రాజేంద్రనగర్,జూలై 07(నమస్తే ఉదయం):**
రెండు తెలుగు రాష్ట్రాలు అభివృద్ధితో ముందుకు పోవాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన హైదరా బాద్‌లో ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుని మర్యాద పూర్వకంగా ప్రకాష్ గౌడ్ కలిశారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడుకు పుష్పగుచ్ఛం అందజేసి ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్ మాట్లా డుతూ... ఇరు రాష్ట్రాలకు ఎంతో ప్రయోజనకరమని అన్నారు. ఇరు రాష్ట్రాలు అన్నదమ్ముల్లా విడిపోయినా అభివృద్ధిలో కలసి సాగాలని రిక్వెస్ట్ చేశారు. జల వివాదాలు లేకుండా రెండు తెలుగు రాష్ట్రాలు అభివృద్ధి పథంలో సాగేందుకు చంద్రబాబు అనుభవం ఎంతో దోహదం చేస్తుందన్నారు.



## మణికొండ కేవ్ పబ్‌లో డ్రగ్స్ కలకలం..
# 24 మందికి పాజిటివ్


**గండిపేట్,జులై 07(నమస్తే ఉదయం):**
మణికొండ ఖజాగూడలోని దీకేవ్ పఫ్ క్లబ్‌లో డ్రగ్స్ కలకలం రేపింది. మాదకద్రవ్యాలు వినియోగిస్తున్నారనే సమాచారంతో రాయదుర్గం పోలీసులు,నార్కొటిక్ బ్యూరో అధికారులు ఆకస్మిక దాడులు చేశారు. సుమారు 50 మందిని అదుపులోకి తీసుకుని వారికి పరీక్షలు నిర్వహించారు. అందులో 24 మందికి పాజిటివ్ వచ్చినట్లు నిర్ధారణ



అయింది. దీంతో అందరిని అదుపులోకి తీసుకున్నారు. పట్టబడ్డవారిలో పబ్ నిర్వాహ కులు, డీజే ఆపరేటర్లు ఉన్నారు. ఇంకా ఎవరెవరు ఉన్నారనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. గంజాయి,ఇతర మత్తు పదార్థాలు సేవించిన ఆనవాళ్లు లభించాయి. డీజే ఆపరేటర్‌తో కలిసి పబ్ నిర్వాహకులు డ్రగ్స్ అమ్మినట్లు గుర్తించారు. అసలు సూత్రధారులు ఎవరనే కోణంలో పోలీసులు విచారణ జరుపుతున్నారు. అదుపులోకి తీసుకున్నవారిని కోర్టులో హాజరుపరుచనున్నారు.

## భువనగిరి ఎంపీని మర్యాదపూర్వకంగా
# కలిసిన ముంగి జైపాల్ రెడ్డి

**రాజేంద్రనగర్,జులై 07(నమస్తే ఉదయం):**
భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డిని టీపీసీసీ అధికార ప్రతినిధి ముంగి జైపాల్ రెడ్డి ఆదివారం ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా




కలిశారు. ఈ సందర్భంగా చామల కిరణ్ కుమార్ రెడ్డిని శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. చామల తొలిసారి పోటీ చేసి ఘనవిజయంతో గెలుపొందడంపై శుభాకాంక్షలు తెలిపి అభినందించారు. అనంతరం ఇరువురు పలు అంశాలపై చర్చించారు. ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరించారు. ముంగి జైపాల్ రెడ్డి వెంట కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

# కోర్కెల దినాన్ని జయప్రదం చేయండి

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై 7(నమస్తే ఉదయం):**
కేంద్ర బిజెపి అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 10న దేశవ్యాప్తంగా జరిగే కార్మికుల కోరికల దినాన్ని జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు ఏ. వెంకటస్వామి పిలుపునిచ్చారు. ఆదివారం గద్వాల్ లోని సిఐ టియు జిల్లా కార్యాలయంల జనరల్ బాడీ సమావేశం నిర్వహించి కరపత్రం విడుదల చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర బీజేపీ ప్రభుత్వం గత 10 సంవత్సరాలుగా సాగించిన సంస్కరణలు, ప్రైవేటీకరణ విధానాలను వేగవంతంగా అమలు చేసేందుకు కార్మికుల వ్యతిరేకంగా చేసిన చట్టాలను వేగంగా అమలు పరచడానికి నిర్ణయాలు తీసుకుంటున్నదని దీనికి వ్యతిరేకంగా కార్మిక వర్గం ఐక్యంగా ఉండి పోరాడాలని పిలుపునిచ్చారు. సంఘటిత అసంఘటిత రంగ కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలని గత కొన్ని దశాబ్దాలుగా కార్మిక సంఘాల పోరాటాలు చేస్తున్న కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకపోగా పోరాడి సాధించు కున్న చట్టాలన్ని రద్దు చేస్తున్నారని విమర్శించారు. కార్మికుల ఈపీఎఫ్ బకాయిల చెల్లింపులో యాజమాన్యాలకు విధించే జరిమానాలను భారీగా తగ్గించారని దీనివల్ల యాజమాన్యాలకు లాభాలు కార్మికులపై భారాలు పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నేషనల్ మానిటైజేషన్ పైప్ లైన్ పేరుతో ప్రభుత్వ సంస్థలను లీజుకు ఇవ్వడం అమ్మేయడం ప్రైవేటీకరణ చేయడం లాంటివి మరింత వేగవంతం చేస్తామని ప్రకటించారని దీనివల్ల మొత్తం ప్రభుత్వ రంగం నిర్వీర్యమై యువత ఉపాధి అవకాశాలు



సన్నగిల్లి, సామాజిక న్యాయానికి సమాధి కడుతున్నారని విమర్శించారు. లక్షల కోట్ల ఆదాయం ఆస్తులు ఉన్న ఎల్ఐసి రైల్వే వంటి జాతీయ సంస్థల ప్రైవేటీకరణ వల్ల యువత కార్మిక వర్గం తీవ్రంగా నష్టపోతుందని అన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారము హైయర్ పెన్షన్ చెల్లింపు, అమలు ఓపిఎస్ రద్దు స్కీమ్ వర్కర్లను కార్మికులుగా గుర్తింపు వంటి అంశాలపై కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకు నోరు మెదపడం లేదని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా బుధవారం జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో జరిగే ధర్నా కార్యక్రమాలలో కార్మికుల పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు ఉప్పేర్ నరసింహ, నాయకులు బాలకృష్ణ, రంగన్న, ఆంజనేయులు, రామకృష్ణ, వీరేష్,తిరుపతన్న, వెంకటేష్, ఆది, భాస్కర్, కళ్యాణ్, తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్‌లోనే కొనసాగుతాం...

**బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం**
**తొలి సిఎం కేసిఆర్ అడుగుజాడలో నడుస్తాం**
**కాంగ్రెస్ ప్రభుత్వం హామీలు నెరవేర్చడంలో విఫలం**
**బీఆర్ఎస్ నాయకులు, మాజీ జెడ్పిటిసి బాసు శ్యామల హన్మంతునాయుడు**
**స్వర్గీయ మాజీ ఎమ్మెల్యే గట్టు భీముడు కుటుంబం నాటి నుండి నేటి వరకు బిఆర్ఎస్ పార్టీతోనే**



సమావేశంలో మాట్లాడుతున్న బిఆర్ఎస్ నాయకులు హనుమంతు నాయుడు

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై 7(నమస్తే ఉదయం):**
తెలంగాణ తొలి సీఎం కేసిఆర్ నాయకత్వంలో పని చేస్తామని, పార్టీ మారే ప్రసక్తే లేదని బీఅర్ఎస్ నాయకులు, మాజీ జెడ్పిటిసి బాసు శ్యామల హన్మంతునాయుడు, నాయకులు మోనేష్ మారోజు, తిరుమల్, వెంకటేష్, తదితరులు స్పష్టం చేశారు. ఆది వారం జిల్లా కేంద్రంలో బాసుశ్యామల హన్మంతునాయుడు నివా సంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బాసు శ్యామల హన్మంతునాయుడు మాట్లాడుతూ.... తెలంగాణ ఉద్యమంలో తొలి సిఎం కేసిఆర్ వెనంటే ఉంటూ ఉద్యమంలో పాల్గొంటూ తెలంగాణ రాష్ట్రాన్ని సాధించకోవడం జరిగిందన్నారు. నాడు ఆర్డీఎస్ సాధించుకోవడానికి కేసిఆర్ చేపట్టిన పాదయాత్రలో నడిగడ్డ నుంచి ఉద్యమకారులు పాల్గొన్నట్లు పేర్కొన్నారు. బీఅర్ఎస్ పార్టీలో కొనసాగుతూ కేసీఆర్ అడుగుజాడల్లో మా కుటుంబం ఉద్యమ కాలం నుండి నేటి వరకు కొనసాగిస్తూ వస్తున్నామని, కొన్ని అనివార్యకారణాల వల్ల మా కుటుంబానికి గద్వాల ఎమ్మెల్యే దక్కకున్న పార్టీ కోసం కష్టపడి, భారీ మెజారిటీతో గులాభీ జెండా ఎగురవేశామన్నారు.

బీఆర్ఎస్ పార్టీ తెలంగాణకు కవచం అని, తెలంగాణ ప్రయోజనాల కోసమే పాటుపడుతుందని స్పష్టం చేశారు. పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహిస్తున్న కాంగ్రెస్‌ను ప్రజలు ప్రతిపక్షంలో కూర్చోబెట్టడం ఖాయమని చెప్పారు. ఆరు గ్యారెంటీల హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ హామీలు అమలుపరచ డంలో విఫలమైందని విమర్శించారు. బీఅర్ఎస్ పార్టీ నుంచి గెలిచిన గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి స్వలాభాల కోసం కాంగ్రెస్ పార్టీలో చేరినంత మాత్రనా నడిగడ్డలో బీఅర్ఎస్ పార్టీ ఖాళీ కాలేదని, ఇంకా బీఅర్ఎస్ పార్టీకి ప్రజలలో మంచి ఆదరణ ఉందని, బీఅర్ఎస్ పార్టీ బలోపేతం చేస్తూ రానున్న ఎన్నికలలో గులాభీ జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. త్వరలోనే బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించి బీఅర్ఎస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తామన్నారు.

కేసీఆర్, కేటీఆర్ ఆదేశాల మేరకు బీఅర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు భరోసా కల్పించి నడిగడ్డలో పార్టీ బలోపేతం చేస్తామని, ఎవరూ అధైర్యపడకుండా పార్టీలో కొనసాగించాలని కోరారు.





గోల్కొండ బోనాల ఉత్సవాలలో బోనం ఎత్తుకున్న ఎమ్మెల్యేలు ప్రకాష్ గౌడ్, రాకేష్ రెడ్డిలు, కుమ్మర్లు నిర్వహించిన బోనాల ఉత్సవాలలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

# ఘనంగా గోల్కొండలో ఆషాడం బోనాల సందడి..

## ఆషాఢ జాతర షురూ..గోల్కొండ జగదాంబిక అమ్మవారికి తొలి బోనం

**గోల్కొండ,జులై 07(నమస్తే ఉదయం):**
ఆషాఢ మాస బోనాల ఉత్సవాలు నగరంలో ఆదివారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. చారిత్రక గోల్కొండ కోటలో కొలువుదీరిన జగదాంబిక మహంకాళి ఎల్లమ్మకు తొలి బోనం సమర్పించి..బోనాల ఉత్సవాలు ప్రారంభించారు. లంగర్ చౌరస్తాలో పోతురాజుల వీరంగాలు శివశక్తుల ఆటలతో జాతర శోభ సంతరించుకుంది. మధ్యాహ్నం 12 గంటలకు లంగర్ హౌస్ నుంచి డప్పుచప్పుళ్లు,పోతురాజుల విన్యాసాలతో ఊరేగింపుగా వెళ్లి గోల్కొండ చోటా బజార్‌లో దిగంబర్ పంతులు ఇంట్లో అమ్మవారిని ఆభరణాలతో అలంకరించి..గోల్కొండ కోటపై ఉన్న ఆలయం వరకు ఊరేగించి తొట్టెలను సమర్పించారు.

అనంతరం బజార దర్వాజా వైపు నుంచి నజర్ బోనంతో అమ్మవారికి ఊరేగింపుగా గోల్కొండ కోటకు తీసుకెళ్లారు. ఆదివారం తొలి పూజ కావడంతో ప్రభుత్వం తరపున అమ్మవారికి స్పీకర్ గడ్డం ప్రసాద్,మంత్రులు కొండా సురేఖ,పొన్నం ప్రభాకర్ చేతుల మీదుగా పట్టువస్త్రాలు సమర్పించారు.

పోతురాజులతో కలిసి మంత్రి పొన్నం ప్రభాకర్ నృత్యాలు చేయడం ఆకట్టుకుంది. హైదరాబాద్, సంస్కృతి,సంప్రదాయాలకు అద్దంపట్టేలా,బోనాల ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలని సీఎం ఆదేశించారని మంత్రి చెప్పారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టామని అన్నారు. ఆదివారం గోల్కొండలో మొదలైన ఈ బోనాలు 9 వారాల పాటు ఘనంగా జరుగు తాయని, మళ్లీ గోల్కొండ కోటలనే బోనాలు ముగుస్తాయి. అమ్మ వారిని దర్శించుకునేందుకు తెలంగాణ రాష్ట్రం నుంచే కాకుండా




గోల్కొండ బోనాలు ఉత్సవాలలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్, చిత్రంలో ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి

కర్ణాటక,మహారాష్ట్రలతో పాటు దేశ, విదేశాల సందర్శకులు తరలి వస్తున్నారు. ప్రతి ఆదివారం, గురువారం జగదాంబిక అమ్మవారికి బోనాలు సమర్పిస్తారు.

### గోల్కొండ కోటలోని జగదాంబిక,మహంకాళి, ఎల్లమ్మలను దర్శించుకున్న ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్

తెలంగాణ సంస్కృతి సంప్రదాయాల్లో బోనాల పండగ ఓ భాగమని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్ అన్నారు. ఆదివారం గోల్కొండ కోటలో కొలువుదీరిన జగదాంబిక, మహం కాళి, ఎల్లమ్మను దర్శించుకున్నారు. ఆయన ప్రత్యేక పూజాలు చేసి మొక్కు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బోనాల పండుగను ప్రజలు ప్రశాంత వాతావరణంలో జరుపు కోవాలని సూచించారు.

### భారీ పోలీస్ బందోబస్తు : డీసీపీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

గోల్కొండ బోనాల కోసం భారీ బందోబస్తు ఏర్పాట్లు చేశామని దక్షిణ,పశ్చిమ మండలం డీసీపీ ఉదయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. బోనాలను ప్రతిష్టాత్మకంగా నిర్వహించడం కోసం 600 మంది పోలీస్ సిబ్బందిని వినియోగిస్తున్నామని,సీసీ కెమెరాల నిఘాలో బోనాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామని చెప్పారు. గోల్కొండ కోటకు వచ్చే వారికి మూడు ప్రాంతాల్లో పార్కింగ్ ఉంటుందని, సెవన్ టూంబ్స్ వద్ద ఓ పార్కింగ్,లంగర్‌హౌస్ హుడా పార్కు వద్ద పార్కింగ్,రాందేవ్‌గూడ దాటిన తర్వాత ఓ పార్కింగ్ ప్రదేశాన్ని కేటాయించామని తెలిపారు. అంతేకాకుండా సెవన్ టూంబ్స్, రాందేవ్‌గూడల వైపు నుంచి వచ్చే వారికి పార్కింగ్ దగ్గర నుంచి కోట వరకు ఉచిత సెట్విన్ బస్సు,లంగర్‌హౌస్ హుడా పార్కు నుంచి వచ్చే వారి కోసం ఫ్రీ ఆటోలను పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నడుపుతున్నట్లు డీసీపీ ఉదయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ప్రజలందరూ పోలీసులకు సహాయ సహకారాలు అందించి ప్రశాంత వాతా వరణంలో బోనాలను జరుపుకోవాలన్నారు.




## మరో మూడేళ్లకు.. కల్కి సెకండ్ పార్ట్


ప్రభాస్ కథానాయకుడిగా, నాగ్ అశ్విన్ దర్శకత్వంలో వచ్చిన 'కల్కి 2898ఏడి' సినిమా గత వారం విడుదలైంది. ఈ సినిమాకి మిశ్రమ స్పందన లభించింది అనే చెప్పాలి. ఇందులో బాలీవుడ్ లెజండరీ నటుడు అమితాబ్ బచ్చన్, ఇంకొక లెజండరీ నటుడు కమల్ హాసన్ కూడా వున్నారు. ఇప్పుడు విడుదలయింది మొదటి పార్టు అని, రెండో పార్టు ఇంకో మూడు సంవత్సరాల తరువాత విడుదలయ్యే అవకాశం ఉందని అంటున్నారు. సినిమాలో ప్రభాస్ పాత్ర నిడివి చాలా తక్కువయిందని టాక్ వినిపించింది అన్న సమాధానానికి దర్శకుడు రెండో పార్టులో ఎక్కువ ఉంటుంది అని చెప్పారు. ఈ సినిమా ఫస్ట్ హాఫ్ అయ్యేసరికి చాలామంది ప్రేక్షకులకి అర్థం కాలేదు. సినిమా కూడా చాలా నెమ్మదిగా సాగుతూ ఉండటంతో ప్రేక్షకులకి కొంచెం బోర్ కూడా కొట్టింది అనే వార్తలు వినిపించాయి. అదే విషయాన్ని దర్శకుడు నాగ్ అశ్విన్ కూడా ఒప్పుకున్నారు. కాంప్లెక్స్‌లో సన్నివేశాలని కొంచెం వేరేగా చూపిస్తే నిడివి తగ్గి ఉండేదని చెప్పారు. ఆ విమర్శని నేను పాజిటివ్ గానే తీసుకుంటున్నాను అని చెప్పారు నాగ్ అశ్విన్. అలాగే సినిమా అయ్యాక డబ్బింగ్ కూడా బాగోలేదని సామాజిక మాధ్యమాల్లో బాగా విమర్శలు వచ్చాయి. దానికి నాగ్ అశ్విన్ కూడా డబ్బింగ్ అనుకున్నంత సరిగ్గా రాలేదని ఒప్పుకున్నారు. ఆ పాత్ర వేసినవాళ్ళే డబ్బింగ్ చెపితే బాగుంటుంది అని చెప్పించాం, కానీ అది పట్టినట్టు ఉందని తరువాత అర్థం అయింది అని నాగ్ అశ్విన్ చెప్పారు. నేపథ్య సంగీతం గురించి మాట్లాడుతూ కూడా కొన్ని చోట్ల బాగుంది, కొన్ని సన్నివేశాల్లో ఇంకా కొంచెం బాగుంటే బాగుండేది అనే ఫీలింగ్ తనకి కూడా వచ్చింది అని నాగ్ అశ్విన్ అన్నారు.

భారతీయుడు-2 రన్‌టైమ్

## 3.04 గంటలు

### సెన్సార్ బోర్డు యూ/ఏ సర్టిఫికెట్

ప్రముఖ నటుడు కమల్ హాసన్ హీరోగా శంకర్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'భారతీయుడు 2'సినిమా 'భారతీయుడు'కు సీక్వెల్‌గా వస్తోంది. తాజాగా ఈ యాక్షన్ థ్రిల్లర్ సెన్సార్ పూర్తి చేసుకుంది. కొన్ని సూచనలు ఇస్తూ సెన్సార్ బోర్డు దీనికి యూ/ఏ సర్టిఫికెట్ ఇచ్చింది. 'భారతీయుడు 2' రన్‌టైమ్ ఏకంగా 3.04 గంటలు ఉంది. కొన్ని సన్నివేశాల్లో ఉపయోగించిన పదాలను మ్యూట్ చేయాలని సెన్సార్ బోర్డ్ చిత్రబృందాన్ని సూచించింది. ఇంత నిడివి ఉన్న చిత్రాలు ప్రేక్షకులను ఆకట్టుకోవాలంటే అందుకు తగిన కథ, కథనాలు ఉండాలి. అయితే శంకర్ ఈ విషయంలో పూర్తి విశ్వాసంతో ఉన్నారు. దీని గురించి ఆయన మాట్లాడుతూ అన్ని సన్నివేశాలు అద్భుతంగా వచ్చాయన్నారు. జులై 12న ఈ సినిమా విడుదల కానుంది.ఇటీవల వచ్చిన 'యానిమల్', 'సలార్', 'కల్కి 2898 ఏడీ' చిత్రాలు మూడు గంటలకు పైగా రన్‌టైమ్‌తో విడుదలయ్యాయి. ఇప్పుడు వీటి జాబితాలో కమల్ హాసన్ 'భారతీయుడు 2' చేరింది. ఆ సినిమాలన్నీ విజయం సాధించి కలెక్షన్ల వర్షం కురిపించాయి. ఇప్పటికే 'భారతీయుడు 2'పై భారీ అంచనాలున్న నేపథ్యంలో ఈ చిత్రం కూడా మంచి వసూళ్లు సాధించడం ఖాయమని సినీప్రియులు అభిప్రాయ పడుతున్నారు. 'భారతీయుడు' 1996లో శంకర్ దర్శకత్వంలో వచ్చి సంచలనం సృష్టించింది. సేనాపతి పాత్రలో కమల్ ప్రేక్షకుల్ని విశేషంగా ఆకట్టుకున్నారు. ఈ చిత్రానికి సీక్వెల్‌గా 'భారతీయుడు 2' మరోసారి మ్యాజిక్ చేసేందుకు సిద్ధమైంది. అవినీతిపై ఉద్దం చేసే లక్ష్యంతో చిత్ర కథ నడవనుంది.





## దుమ్మురేపుతున్న కల్కి వసూళ్లు


### 800కోట్లకు చేరినట్లు చిత్రబృందం పోస్ట్

ప్రభాస్ కీలక పాత్రలో నాగ్ అశ్విన్ దర్శకత్వంలో తెరకెక్కిన 'కల్కి 2829 ఏడీ' హవా కొనసాగుతోంది. యాక్షన్ సన్నివేశాలు, విజువల్ ఎఫెక్ట్స్‌తో అత్యంత ప్రేక్షకాదరణ సొంతం చేసుకున్న ఈ చిత్రం కలెక్షన్ల వర్షం కురిపిస్తోంది. తొలిరోజే రూ.191.5 కోట్లు వసూలు చేసిన 'కల్కి' ఇప్పుడు రూ.800కోట్లను తన ఖాతాలో వేసుకుంది. ఈ విషయాన్ని తెలుపుతూ చిత్రబృందం పోస్ట్ పెట్టింది. ప్రభాస్ పాత్రకు సంబంధించిన ఓ ఫొటోను షేర్ చేసింది. ఈ మైథాలజీ సైన్స్ ఫిక్షన్ ఫిల్మ్ రూ.1000 కోట్ల క్లబ్‌లో చేరడమే తరువాయి అంటూ ప్రభాస్ అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు 'కల్కి 2829 ఏడీ' విడుదలకు ముందే అమెరికాలో ప్రభంజనం సృష్టించిన సంగతి తెలిసిందే. అయితే, తాజాగా అక్కడ ఈ చిత్రం నిడివి తగ్గించినట్లు తెలుస్తోంది. దాదాపు 3 గంటలపైన నిడివి ఉన్న 'కల్కి'.. ఇకపై 2.45 గంటలు ప్రదర్శితం కానుంది.



## రాజమౌళిపై నెట్‌ఫ్లిక్స్ డాక్యుమెంటరీ

'బాహుబలి', 'ఆర్ఆర్ఆర్'లతో ప్రపంచాన్ని ఆకర్షించిన రాజమౌళిపై నెట్‌ఫ్లిక్స్ డాక్యుమెంటరీ రూపొందించింది. దీని స్ట్రీమింగ్ తేదీని, ఇందులో ఏం చూపనున్నారో తెలుపుతూ తాజాగా ఆ సంస్థ పోస్ట్ పెట్టింది. దీనికి సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేసింది. 'మోడ్రన్ మాస్టర్స్' పేరుతో ఇది రానున్నట్లు తెలిపింది. 'ఒక మనిషి.. అనేక బ్లాక్‌బస్టర్‌లు.. అంతులేని ఆశయం. ఈ లెజెండరీ దర్శకుడు ఇంత గుర్తింపు తెచ్చుకోవడానికి ఎంత కష్టపడ్డారు? ఎన్ని సంవత్సరాలు పట్టింది? ఇలాంటి అంశాలతో 'మోడ్రన్ మాస్టర్స్' రూపొందింది. ఆగస్టు2 నుంచి నెట్‌ఫ్లిక్స్ వేదికగా ప్రసారం కానుంది' అని సంస్థ పేర్కొంది. దీన్ని అనుపమా చోప్రా సమర్పించనున్నారు. ఈ డాక్యుమెంటరీలో పలువురు హాలీవుడ్ దర్శకులు, సినీ ప్రముఖులు రాజమౌళిపై వారి అభిప్రాయాలను తెలియజేయనున్నారు. టాలీవుడ్ స్టార్ హీరోలు కూడా ఈ దర్శక ధీరుడితో వారి అనుబంధాన్ని పంచుకోనున్నట్లు తెలుస్తోంది. రాజమౌళి ప్రస్తుతం మహేశ్‌బాబుతో తీయనున్న ప్రాజెక్ట్‌తో బిజీగా ఉన్నారు. దీని ప్రీ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఇందులో ఇండోనేషియా నటి చెల్సియా ఎలిజబెత్ ఇస్లాన్ హీరోయిన్‌గా, హాలీవుడ్ ప్రముఖ నటుడు క్రిస్ హెమ్స్‌వర్త్ కీలకపాత్ర పోషించనున్నారని కూడా జోరుగా ప్రచారమవుతోంది. త్వరలోనే దీనికి సంబంధించి అధికారిక ప్రకటన రానుందని సమాచారం.



## రాజ్‌తరుణ్ కేసులో ట్విస్ట్

టాలీవుడ్ నటుడు రాజ్ తరుణ్ తనని మోసం చేశాడంటూ అతని ప్రేయసి లావణ్య పోలీసులకు ఫిర్యాదు ఇచ్చిన విషయం తెలిసిందే. రాజ్ తరుణ్ తనను పెళ్లి చేసుకుంటానని నమ్మించి వదిలేసి వెళ్లిపోయాడని లావణ్య నార్సింగి పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసింది. తాము విడిపోవడానికి కారణం ఓ సినీ నటి అని, రాజ్ తరుణ్‌ను వదిలేయకపోతే చంపేసి బాడీ కూడా దొరకకుండా చేస్తామని బెదిరించినట్లు సినీ నటితోపాటు ఆమె సోదరుడిపై ఫిర్యాదు చేసింది లావణ్య. అయితే ఈ కేసులో పోలీసులు లావణ్యకే రివర్సులో నోటీసులిచ్చారు. ఈ నోటీసులో ఫిర్యాదుకు సంబంధించి తగిన ఆధారాలు సమర్పించాలని 91 సీఆర్‌పీసీ కింద నోటీసులు జారీ చేశారు. అయితే ఈ నోటీసులపై ఇంకా లావణ్య స్పందించలేదు. మరోవైపు లావణ్యను విచారణకు పిలిస్తే.. తన వైపు వాదనలను కూడా వినిపిస్తానని నటుడు రాజ్ తరుణ్ నార్సింగి పోలీసులతో చెప్పినట్లు సమాచారం. కాగా.. ఈ ఘటనపై మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది. పదకొండేళ్లుగా రాజ్‌తరుణ్‌తో రిలేషన్‌షిప్‌లో ఉన్నా. గుడిలో కూడా పెళ్లి చేసుకున్నాం. కానీ తన సినిమాలో నటిస్తోన్న హీరోయిన్‌తో అఫైర్ పెట్టుకొని నన్ను వదిలేశాడు. 3 నెలల క్రితం రాజ్ తరుణ్ ఇంటి నుంచి వెళ్లిపోయి దూరంగా ఉంటున్నాడు. రాజ్ తరుణ్‌ను వదిలేయకపోతే చంపేసి బాడీ కూడా మాయం చేస్తామని బెదిరిస్తున్నారు. రాజ్ తరుణ్ నా ప్రపంచం..రాజ్ తరుణ్ నాకు కావాలి. నాకు న్యాయం చేయాలి. గతంలో తనను డ్రగ్స్ కేసులో కావాలనే ఇరికించారని లావణ్య ఆవేదన వ్యక్తం చేసింది. ఈ కేసులో అరెస్టై 45 రోజులు జైల్లో ఉన్నానని.. ఆ సమయంలో రాజ్ తరుణ్ తనకెలాంటి సాయం చేయలేదని పేర్కొంది లావణ్య. అయితే ఈ వ్యాఖ్యలపై స్పందించిన రాజ్ తరుణ్.. లావణ్యను నేను మోసం చేసిన మాట అవాస్తవం. లావణ్యతో నేను ఇంతకుముందు రిలేషన్‌లో ఉన్నాను. కానీ లావణ్య డ్రగ్స్ వాడడం మొదలుపెట్టింది. అదే కాకుండా వేరే అబ్బాయితో లావణ్య రిలేషన్‌షిప్‌లో ఉంది. కన్న తండ్రిని కూడా లావణ్య మోసం చేసింది.



## వినూత్న కథాంశంతో ..సరిపోదా శనివారం మూవీ

'సరిపోదా శనివారం'తో సినీప్రియుల్ని అలరించేందుకు సిద్ధమవుతున్నారు నాని. ఆయన కథానాయకుడిగా నటిస్తున్న ఈ చిత్రాన్ని వివేక్ ఆత్రేయ తెరకెక్కిస్తున్నారు. డీవీవీ దానయ్య, కల్యాణ్ దాసరి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ప్రియాంక అరుల్ మోహన్ కథానాయిక. ఎస్.జె.సూర్య కీలక పాత్ర పోషిస్తున్నారు. నాని ఇందులో సూర్య అనే పాత్రలో కనిపించనున్న సంగతి తెలిసిందే. ఆ పాత్రకు సంబంధించిన రెండో లుక్‌ను గురువారం విడుదల చేశారు. శనివారాల్లో యాక్షన్ కోణంలో హింసాత్మకంగా కనిపించే సూర్య.. మిగిలిన రోజుల్లో ఎలా ఉంటాడన్నది ఈ ప్రచార చిత్రంతో చూపించారు. నాని ఆ పోస్టర్‌లో పక్కింటి కుర్రాడి తరహాలో బైక్‌పై చిరునవ్వులు చిందిస్తూ రావడం కనిపించింది. 'వినూత్నమైన కథాంశంతో రూపొందుతోన్న యాక్షన్ చిత్రమిది. దీంట్లో నాని పాత్ర రెండు కోణాల్లో కనిపిస్తుంది. ప్రస్తుతం చిత్రీకరణ ముగింపు దశలో ఉంది' అని చిత్రవర్గాలు తెలిపాయి. ఇది ఆగస్టు 29న థియేటర్లలోకి రానుంది. సంగీతం: జేక్స్ బిజోయ్, ఛాయాగ్రహణం: జి.మురళి.

## అసలు కథంతా ముందున్నది : నాగ్ అశ్విన్ వ్యాఖ్య

ప్రభాస్ హీరోగా నాగ్ అశ్విన్ దర్శకత్వంలో తెరకెక్కిన 'కల్కి 2898 ఏడీ' ప్రభంజనం సృష్టిస్తోంది. ఈ చిత్రానికి సీక్వెల్ ఉన్న సంగతి



తెలిసిందే. ఇప్పటికే నిర్మాత పలు సందర్భాల్లో దాని గురించి మాట్లాడారు. తాజాగా మొదటిసారి నాగ్ అశ్విన్ 'కల్కి' సీక్వెల్‌పై స్పందించారు. అసలు కథ మొదలయ్యేది పార్ట్2లోనే అంటూ ఆసక్తికర విషయాన్ని పంచుకున్నారు. సీక్వెల్‌కు సంబంధించి నెలరోజుల షూటింగ్ చేశాం. దానిలో 20శాతం బెస్ట్‌గా వచ్చింది. ఇంకా ముఖ్యమైన యాక్షన్ సన్నివేశాలు చిత్రీకరించాల్సి ఉంది. వాటిని కొత్తగా ప్రారంభించాలి. ఈ సీక్వెల్‌లో కమల్ హాసన్, ప్రభాస్ , అమితాబ్ మధ్య భారీ యాక్షన్ సన్నివేశాలుంటాయి. అశ్వత్థామ, కర్ణుడు, యాస్కిన్‌ల మధ్య శక్తిమంతమైన ధనుస్సు కీలకం కానుందని అన్నారు. యాస్కిన్ పాత్రకు సీక్వెల్‌లో నిడివి ఎక్కువ ఉంటుందని ఇటీవల కమల్ కూడా చెప్పారు. దీంతో 'కల్కి2'పై ఆసక్తి పెరిగింది. ఈ సినిమాకు వస్తోన్న ఆదరణపై నాగ్ అశ్విన్ సంతోషం వ్యక్తం చేశారు. 'ప్రేక్షకులు దీన్ని ఎంతగానో ఎంజాయ్ చేస్తున్నారు. ఎంతోమంది ఆడియన్స్ ఒకసారి కంటే ఎక్కువసార్లు దీన్ని వీక్షిస్తున్నారు. సినిమా విజయం సాధించిందని చెప్పడానికి అదే సంకేతం' అంటూ ప్రేక్షకులకు ధన్యవాదాలు చెప్పారు.

జూన్ 27న ప్రేక్షకుల ముందుకు వచ్చిన 'కల్కి' కలెక్షన్లలో రికార్డులు సృష్టిస్తోంది. ఇప్పటి వరకు రూ.700కోట్లకు పైగా వసూళ్లు చేసినట్లు చిత్రబృందం తెలిపింది. త్వరలోనే ఈ సైన్స్ ఫిక్షన్ రూ. 1000 కోట్ల క్లబ్‌లో చేరడం ఖాయమని అభిమానులు అంటున్నారు. ఆడియన్స్‌ను కొత్త ప్రపంచంలోకి తీసుకెళ్లిన ఈ చిత్రంలో అగ్ర నటులు అమితాబ్ బచ్చన్.. అశ్వత్థామగా, కమల్ హాసన్.. సుప్రీం యాస్కిన్‌గా ఆకట్టు కున్నారు. విజయ్ దేవరకొండ, దుల్కర్ సల్మాన్ అతిథి పాత్రలతో అలరించారు. బౌంటీ ÷టైర్ భైరవగా సందడి చేసిన ప్రభాస్.. చివరిలో కర్ణుడిగా కనిపించి పార్ట్ 2పై మరిన్ని అంచనాలు పెంచేశారు. ఇప్పుడు నాగ్ అశ్విన్ కామెంట్స్‌తో అవి రెట్టింపయ్యాయి.

## అమెజాన్ కోసం రానా షో



ప్రముఖ నటుడు రానా దగ్గుబాటి తెలుగులో సినిమా చేసి చాలా కాలం అయింది. 2022 లో పవన్ కళ్యాణ్ తో చేసిన 'భీమ్లా నాయక్' తరువాత వచ్చిన 'విరాట పర్వం' విడుదలైన తరువాత, రానా తెలుగు సినిమా చెయ్యలేదు. సుమారు రెండు సంవత్సరాలకి పైగా అయింది, రానా తెలుగు సినిమా వొప్పుకొని. అయితే ఇప్పుడు రానా దగ్గుబాటి తమిళ సినిమా చేస్తున్నారు. రజినీకాంత్ కథానాయకుడిగా నటిస్తున్న 'వెట్టియాన్' లో రానా విలన్ గా నటిస్తున్నాడు. దీనికి 'జై భీం' ఫేమ్ టిజె జ్ఞానవేల్ దర్శకుడు. ఈ సినిమా చిత్రీకరణ ఇంకా కొంచెం మిగిలి వుంది అని తెలిసింది. ఇదిలా ఉండగా రానా దగ్గుబాటి ఈమధ్య చాలా చిన్న సినిమాలని ప్రోత్సహిస్తున్నాడు. ఇంతకు ముందు 'పరేషాన్' అనే సినిమాని ప్రోత్సహించినట్టుగానే ఇప్పుడు '35' అనే సినిమాకి రానా ముందుండి నడిపిస్తున్నాడు. అలాగే మలయాళం సూపర్ స్టార్ దుల్కర్ సల్మాన్ తో ఒక సినిమా నిర్మిస్తున్నాడు రానా. ఈ సంవత్సరం ఈ సినిమా చిత్రీకరణ మొదలవుతుందని తెలుస్తోంది. ఇవి కాకుండా రానా దగ్గుబాటి అమెజాన్ ప్రైమ్ వీడియో కోసం ఒక షో చేస్తున్నట్టుగా తెలిసింది. ఈ షో కి 'ది రానా కనెక్షన్' అని పిలుస్తున్నారు. ఇందులో రానా దగ్గుబాటి దక్షిణాదికి చెందిన అగ్ర నటులను ఒక దగ్గరకి చేర్చి వారితో సంభాషించనున్నట్టుగా తెలుస్తోంది. అయితే ఇంతకు ముందు నటులతో చాలా షో లు వచ్చినా, రానా ఇది తన మార్కు వుండేటట్టుగా ఒక అద్భుతమైన కాన్సెప్ట్ తో వెళుతున్నట్టుగా తెలిసింది. ఈ షో కోసమని రామానాయుడు స్టూడియో లో ఒక సెట్ కూడా తయారవుతోంది అని వినికిడి. అలాగే కొన్ని తెలుగు సినిమాలు కూడా ఈ సంవత్సరం ప్రకటించే అవకాశం ఉందని తెలుస్తోంది. ఇవన్నీ కాకుండా 'రానా నాయుడు' వెబ్ సిరీస్ రెండో సీజన్ చిత్రీకరణ జరుగుతోంది. తెలిసిందే.

**Printed and Published MEKALA DAMODAR REDDY** on behalf of VANITHA Publications, and Printed at Vanitha Graphics, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy,Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: M.Damodhar Reddy. "RNI. Title- Code: TELTEL/2023/87699**. Cell: 9492148733